విశాలాంధ్ర
గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

భీమవరంలో

పెంటపాడులో

కామవరపుకోటలో

విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించాలి

జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి

విశాలాంధ్ర- భీమవరం: బడి ఈడు పిల్లలలో రక్తహీనత ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని, ఆరోగ్యశాఖ మరింత శ్రద్ధ చూపాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. మంగళ వారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం

సమావేశ మంది రంలో జిల్లా కలెక్టర్ రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ఎనిమిది స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బడి ఈడు పిల్లలు ఎట్టి పరిస్థితుల్లో రక్తహీనతకు గురికాకుండా ఎప్పటికప్పుడు వారికి పౌష్టికాహారం అందించడంతోపాటు, సంబంధిత మందులను రోజుకు రెండు సార్లు చొప్పున అందజేసేలా చూడాలన్నారు. రక్తహీనతను చాలా సాధారణంగా తీసుకోవద్దని సూచించారు. ఒకసారి గర్భం దాల్చిన మహిళ రక్తహీనతకు గురై చికిత్స అనంతరం, రెండో కాన్పుకు కూడా ఇదే పరిస్థితి ఎందుకు తలెత్తుతుందని వైద్య శాఖ అధికారులను నిలదీశారు. ఇప్పటివరకు 890 మంది బడి బయట పిల్లలను గుర్తించడం జరిగిందని, వారిలో 353 మందిని బడిలో చేర్పించడం జరిగిందన్నారు. మిగతా పిల్లలను కూడా బడిలో చేర్పించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. పాఠశాలల తనిఖీల్లో ఎపిఎంలు అలసత్వం కనిపిస్తుందని, ఈ విధమైన ధోరణిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా జి.ఎస్.డబ్ల్యూ.ఎస్ అధికారి కెసిహెచ్ అప్పారావు, డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ డి.మహేశ్వరరావు, డీఈవో ఆర్.వి.రమణ, ఐసిడిఎస్ పిడి బి.సుజాత రాణి, జిల్లా ఒకేషనల్ ఎడ్యుకేషన్ అధికారి వి. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

360 మంది పందెం రాయళ్ళపై కేసు నమోదు

విశాలాంధ్ర - భీమవరం టౌన్ : సంక్రాంతి ముసుగులో నిర్వహించే పందేల నిర్వహకులపై కేసులు నమోదు చేశామని జిల్లా ఎస్పీ యు. రవి ప్రకాష్ అన్నారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఈనెల 14 నుండి 16 వరకు పలు ప్రాంతాలలో సాంప్రదాయ ముసుగులో గుండాటలు, పేకాటలు, కోడిపందాలు, ఆడే వారిపై దాడులు నిర్వహించి 360, కేసులు నమోదు చేసి 935 మంది అరెస్ట్

చేసి 210 పందెం కోళ్ళు,227 కోడికత్తులు, రూ.10,17,836 నగదు స్వాధీనపరచు కున్నామని ఎస్పీ తెలిపారు. గుండాటలు, పేకాటలు, నిర్వహించే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నామని ఆయన తెలిపారు.

ఎస్పీ తీరుపై ప్రశంసలు

విశాలాంధ్ర - లింగపాలెం : అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీని పలువురు ప్రశంసిస్తున్నారు. ఈ జిల్లాలో జూద క్రీడలు, కోడి పందేలు జరగకుండా అరికట్టిన సంఘటనపై విశాలాంధ్రలో పోలీస్ అంటే ఇలా ఉండాలి అనే శీర్షికన ప్రచురించిన కథనంపై జంతు ప్రేమికులు, జూద క్రీడల వ్యతిరేకులు ఎస్పీ చర్యలను మెచ్చుకుంటున్నారు. సంప్రదాయం ముసుగులో జూద క్రీడలు, కోడి పందేలు విచ్చలవిడిగా వేస్తున్నా మౌనంగా ఉంటున్న పోలీసుల తీరుపై విమర్శలు ఉన్న నేపథ్యంలో అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ వ్యవహరించిన తీరుపై ప్రజల్లో సంతోషం వ్యక్తమవుతోంది. పలు ప్రచార మాధ్యమాలలో ఈయన చేసిన కృషిపై కథనాలు రావటంతో జంతు ప్రేమికులు, జూద క్రీడల వ్యతిరేకులు అభినందిస్తు న్నారు. పోలీసులు తమ విధులను సవ్యంగా నిర్వర్తిస్తే ప్రతి ఒక్కరూ ప్రజల నుంచి ఇలాంటి ప్రశంసలు పొందుతారని పేర్కొంటున్నారు.

గణపవరం తహసీల్దార్‌గా స్వామి

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం తహసీల్దారుగా సిహెచ్ యు వి కె కృష్ణస్వామి మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఆయన నిడమర్రు మండల తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారగా పనిచేసి గణపవరం తహసీల్దార్ (ఎఫ్ ఎ సి)గా బాధ్యతలు చేపట్టారు.

గతంలో ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ బొద్దు శ్రీనివాసరావు గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. స్వామికి కార్యాలయం సిబ్బంది స్వాగతం పలికారు. డిప్యూటీ తహసీల్దార్ ఎం.సన్యాసిరావు, రెవిన్యూ ఇన్స్పెక్టర్, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు న్యాయం చేస్తా

విశాలాంధ్ర-నరసాపురం: జాతీయ రహదారి విస్తరణలో భాగంగా భూములు ఇచ్చిన ప్రతి రైతుకు తగిన న్యాయం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు తెలిపారు. మంగళవారం నరసాపురం మండలం వై.యస్ పాలెం పంచాయతీ పితానివానిమెరక రైతు భరోసా కేంద్రం వద్ద జాతీయ రహదారి

విస్తరణలో భాగంగా రాజులంక, లక్ష్మేశ్వరం, వైఎస్ పాలెం, సీతారాంపురం ప్రాంతాల్లోనీ 9.7 కిలోమీటర్ల పరిధిలో భూములను ఇచ్చిన రైతులతో రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ ముదునూరి ప్రసాద్ రాజు, జిల్లా జాయింట్ కలెక్టర్ జెవి మురళి సంయుక్తంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా చీఫ్ విప్ ముదునూరి ప్రసాద్ రాజు మాట్లాడుతూ మన ప్రాంత అభివృద్ధిలో రైతులంతా భాగస్వామ్యం కావాలనీ, మీ సహకారంతోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. నిబంధనల మేరకు పూర్తి న్యాయం చేస్తామని ఈ సందర్భంగా తెలి పారు. భూమినిచ్చిన రైతుల భూమి వివరాలను పరిశీలించి ప్రభుత్వ ధరకు రెండున్నర రెట్లు ఇచ్చేలా కృషి చేస్తానన్నారు. భూ రికార్డులను పరిశీలించి వాస్తవ భూమి వివరాలను తెలియజేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ను ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాద రాజు కోరారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ జె.వి మురళి, నరసాపురం సబ్ కలెక్టర్ ఎం.సూర్య తేజ, తహసీల్దార్ ఎస్.ఎం ఫాజిల్, నాలుగు గ్రామాల రైతులు, తదితరులు పాల్గొన్నారు.

జూద క్రీడలకు ఉచిత విద్యుత్

విశాలాంధ్ర - పెనుమంత్ర: మండలంలోని జూద క్రీడలు, కోడి పందాల బరుల వద్ద దగ్గరలోని విద్యుత్ స్తంభాల నుండి నేరుగా కేబుల్ ద్వారా మూడు రోజులు రాత్రి పగలు తేడా లేకుండా అక్రమ విద్యుత్ వినియోగిస్తుంటే అటువైపు కన్నెత్తైనా చూడలేదు పెనుమంత్ర విద్యుత్ శాఖ వారు. సామాన్యులపై విరుచుకుపడే విద్యుత్ శాఖ వారు గత 3 రోజులుగా పండగ పేరు చెప్పి కోడిపందాల బరుల వద్ద అక్రమ విద్యుత్ వినియోగిస్తుంటే కన్నెత్తైనా చూడకపోవడం పై అక్రమ విద్యుత్ వినియోగంపై అధికార

యంత్రాంగం ఏం చేస్తుందని మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీరిపై ఉన్నత అధికారులు ఏ విధమైన చర్యలు తీసుకుంటారో వేచి చూడవలసి ఉంది.

జగనన్న గృహాలకు రూ.5 లక్షలు కేటాయించాలి

సీపీఐ డిమాండ్

విశాలాంధ్ర -భీమవరం: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణానికి 5 లక్షల రూపాయలు కేటాయించి, మౌలిక సౌకర్యాలు కల్పించాలని సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా మంగళవారం భీమవరం శివారు విస్సాకోడేరు వద్ద నిర్మితమవుతున్న జగనన్న కాలనీల్లో గృహాల నిర్మాణ పనులను సీపీఐ భీమవరం పట్టణ కార్యదర్శి చెల్లబోయిన రంగారావు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు సికిలే పుష్పకుమారి, సీపీఐ జిల్లా సమితి సభ్యుడు ఏలేటి విజయానంద్‌లతో కలిసి జగనన్న కాలనీ సందర్శించారు. జగనన్న గృహ నిర్మాణ లబ్దిదారు లను కలిసి గృహ నిర్మాణంలో వారెదుర్కొంటున్న ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. జగనన్న కాలనీల్లో సరైన రోడ్లు, విద్యుత్,నీటి సరఫరా లాంటి మౌలిక సదుపాయాలు లేక లబ్దిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సిమెంట్, ఇసుక, స్టీల్ లాంటి భవన నిర్మాణ మెటీరియల్ ధరలు విపరీతంగా పెరిగి రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న 1.80 లక్ష రూపాయలు సరిపోక లబ్దిదారులు ఇబ్బంది పడుతున్నారన్నారు. రోడ్లు సరిగా లేక గృహ నిర్మాణ మెటీరియల్ తెచ్చు కోవడంలో ఇబ్బందు లెదుర్కొంటున్నారన్నారు. కాలనీలకు వెళ్ళడానికి సరైన రోడ్లు నిర్మించాలని, త్రాగునీరు, విద్యుత్ లాంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని, గృహ నిర్మాణానికి 5 లక్షలు కేటాయించాలని, లబ్దిదారుల ఇబ్బందులు తొల గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భాగంగా జగనన్న గృహ నిర్మాణాలకు 5 లక్షల రూపాయలు పెంచాలని కరపత్రాలను పంపిణీ చేశారు.

పెంటపాడులో : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రకటించిన నవరత్నాల్లో భాగంగా, పేదలందరికి ఇళ్ళు పేరుతో నిర్మించి ఇచ్చిన జగనన్న కాలనీల్లో అనేక సమస్యలు వెల్లు వెత్తుతున్నాయని సీపీఐ మండల కార్యదర్శి కళింగ లక్ష్మణరావు విమర్శించారు. పెంట పాడు మండలం పరిమె ళ్ళ గ్రామంలో జగనన్న కాలనీలో సీపీఐ పోరుబాట కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా జగనన్న ఇళ్ళస్థలాల లబ్దిదారులు తమ ఆవేదనను, వారు ఎదుర్కొంటున్న సమస్యలను సీపీఐ మండల కార్యదర్శి కళింగ లక్ష్మణరావు, సహాయ కార్యదర్శి బి. లక్ష్మీనారాయణ, కొనతల నాగరాజుకు వివరించారు. స్థలాలు లబ్దిదారులకు ముందు ఇచ్చి తర్వాత 3సార్లు మార్చారని చెప్పారు. ముందు ఇచ్చినప్పుడు మెరక మీద ఇచ్చారని, తర్వాత మురుగు డ్రైన్ మెరక వెయ్యకుండా, పెద్దపెద్ద వృక్షాలు ఉండగానే 12 మందికి ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థలాల కేటాయింపులో ముడుపులు చేతులు మారాయన్నారు. ఈ సందర్భంగా కళింగ లక్ష్మణరావు వారితో మాట్లాడుతూ ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి ఇస్తున్న రూ.1 లక్ష80 వేలు పునాదు లకు సరిపోవని గృహ నిర్మాణానికి రూ.5లక్షలు కేటాయించాల న్నారు. జగనన్న కాలనీలో కనీస సౌకర్యాలు కల్పించాల న్నారు. ఇళ్ల స్థలాల కేటాయింపులు జరిగిన అవకతవకలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జగనన్న లబ్దిదారులు గండికోట బోడెమ్మ, గండికోట గొల్లమ్మ, గండికోట వెంకటరావు, నక్క అంజమ్మ, నక్క మంగ గండికోట ముత్యాలు నక్క పెద్దిరాజు, నక్క ఎంకమ్మ, గాది కొండమ్మ, గండికోట స్వామి, నక్క స్వామి, గండికోట వెంకటేష్, గండికోట గొల్ల రాజు, నక్క జ్ఞానపు, గండికోట వెంకటరావు, గండికోట దానియేలు, నక్క నాగేశ్వరరావు, గండికోట కుమారి, తదితరులు పాల్గొన్నారు.

కామవరపుకోటలో : జగనన్న కాలనీ ఇంటి నిర్మాణానికి రూ. ఐదు లక్షలు పెంచాలని సీపీఐ మండల కార్యదర్శి టీవీఎస్ రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఎన్నికల ముందు ప్రకటించిన నవరత్నాలలో భాగంగా రాష్ట్రంలోని అందరికీ ఇల్లు అనే పేరుతో నిర్మాణం చేపడుతున్నారని, నిర్మాణానికి అవసరమైన మౌలిక సదుపాయాలను ఏమాత్రం కల్పించలేదని మొక్కుబడిగా నిర్మించే కాలనీలో కుటుంబ సమేతంగా నివసించే సౌకర్యాలు లేవని అన్నారు. తాడిచర్ల గ్రామంలో పాక్షికంగా నిర్మించిన ఇళ్లను పరిశీలించారు. ఏఐటీయూసీ ఏరియా అధ్యక్షులు మాట్లాడుతూ నేడు సిమెంట్ ఇసుక ఐరన్ తదితర ముడి వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయా యన్నారు. ప్రతి ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు కోడిగంటి సోమరాజు, అమూర్తులు, సుబ్బరాజు, బాలిన రమణారావు తదితరులు పాల్గొన్నారు.

గోడ పత్రిక ఆవిష్కరణ

విశాలాంధ్ర - వేలేరుపాడు : విశాఖలో ఈనెల 27న నిర్వహించే కార్మిక మహాగర్జనకు మద్దతుగా చేయబోయే కార్యక్రమాలకు సంబంధించిన గోడ పత్రికను స్థానిక సీపీఐ కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. సీపీఐ, ఏఐటియుసి పిలుపులో భాగంగా ఈనెల 24న జంగారెడ్డిగూడెం రెవిన్యూ డివిజన్ కార్యాలయం వద్ద దీక్షను చేపడతామని పేర్కొన్నారు. 32 మంది బలిదానాలతో సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటీకరణ చేయడానికి పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తమ నిర్ణయాన్ని వెంటనే పునరాలోచించకపోతే రాబోయే రోజుల్లో మరిన్ని పోరాటాలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలోరాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎండి మునీర్, మండల కార్యదర్శి బాడిశ రాము, ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కారం దారయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సన్నేపల్లి సాయిబాబు, జిల్లా కౌన్సిల్ సభ్యులు సోడే రమాదేవి, కురిమేళ్ళ వెంకటేశ్వర్లు, కరటం వెంకటేశ్వర్లు, ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి ఎర్ర మధు, కారం భోజ్జి, కట్టి గోపాలరావు, బంధం నాగేశ్వరావు తదితర నాయకులు పాల్గొన్నారు

ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

విశాలాంధ్ర-తణుకు : సంక్రాంతి సందర్భంగా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మంగళ వారం తణుకు మండలం దువ్వ గ్రామం లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీలలో 23 మంది మహిళలు పాల్గొన్నారు. మొదటి బహుమతి సరిదే మధుశ్రీ , రెండవ బహుమతి సీ. హెచ్ చిలకమ్మ, మూడవ బహుమతి సరిదే సిస్టర్స్ గెలుచు కున్నారు. బహుమతులను దువ్వ గ్రామ సర్పంచ్ అద్దాబాబు, ముదునూరి నాగరాజు, తణుకు వస్త్ర వ్యాపారస్తులు కోటి బాబు, ఉమా , ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి టి. అప్పలస్వామి, సరిదే శ్రీను, సరిదే హారి, ఎస్ రాజేశ్వరరావు లు బహుమతులు ప్రదానం చేసారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో నెల్లూరు ప్రథమ స్థానం

విశాలాంధ్ర- తాడేపల్లిగూడెం రూరల్ : మండలంలోపి ఉప్పరగూడెం గ్రామంలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు మంగళవారంతో ముగిశాయి. ప్రతీ ఏటా సంక్రాంతి పండుగ

సందర్భంగా అంబేద్కర్ గ్రామ పెద్దల కమిటీ ఆధ్వర్యంలో కులాలకు, మతాలకు , పార్టీలకు అతీతంగా గత 50 సంవత్సరాలుగా రాష్ట్ర స్థాయిలో కబడ్డీ పోటీలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. ఈ నేపథ్యంలో 14,15,16,17 తేదీల్లో నాలుగు రోజులుగా ఈ పోటీలు జరిగాయి. రాష్ట్రం నలుమూలల నుండి మొత్తం 16జట్లు నువ్వానేనా అన్నట్లు తలపడ్డాయి. ఈ పోటీల్లో నెల్లూరు కు చెందిన ప్రవీణ్ కుమార్ రాయల్స్ టీమ్ మొదటి స్థానంలో నిలువగా, ఎర్రకుంటపల్లికి చెందిన అన్వేష్ వారియర్స్ టీమ్ రెండవ స్థానంలోనూ, ఉప్పరగూడెంకు చెందిన తన్విక్ కోప్లీ టీమ్ మూడవ స్థానంలో, ఉప్పరగూడెంకు చెందిన మరోక టీమ్, ఎంవీఆర్ టీమ్ లు నాల్గవ స్థానాల్లో నిలిచాయి. బెస్ట్ టీమ్ ఆఫ్ టోర్నమెంట్ గా వెంకట్రావుపాలెం టీమ్ నిలిచింది. మొదటి బహుమతిగా 30వేలు నగదు,సెకండ్ 25వేలు,థర్డ్ 20వేలు, నాల్గవ బహుమతి 15వేలు అలాగే బెస్ట్ టీమ్ కి 5వేలు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఉప్పారగూడెం సర్పంచ్ దండే కనకబాబు, దండగ్గర సర్పంచ్ పిల్లా రాంబాబు, కొత్తూరు సర్పంచ్ హనుమంతు తదితరులు మాట్లాడుతూ కబడ్డీ పోటీలు నిర్వహించడం ద్వారా గ్రామాల్లోని యువత జోధా క్రీడలకు దూరంగా ఉన్నారని తెలిపారు , క్రీడల ద్వారా శారీరక మానసిక ఉల్లాసంతో పాటు క్రీడాకారుల మధ్య స్నేహభావం పెంపొందించుకోవచ్చు అని తెలిపారు. క్రీడల్లో రాణిస్తే ఉన్నత విద్య ఉద్యోగాలు సులభంగా లభిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో దండే చిన గోతియ్య, ఏలూరి వీరస్వామి, దేశాబత్తుల శాంతరావు, మరపట్ల యోహను, దండే వెంకన్న, దండే ఏసురత్నం, దండే కోటయ్య, మరపట్ల సుబ్బారావు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు వంట సామాగ్రి అందజేత

విశాలాంధ్ర-తణుకు : నియోజకవర్గంలోని అత్తిలి మండలం ఈడూరు గ్రామంలో గత వారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల సంభవించిన అగ్నిప్రమాదంలో ఇళ్ళు దగ్ధమై సర్వస్వం కోల్పోయిన బింకం

నరసింహారావు కుటుంబానికి వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అత్తిలి మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు కోరుకొల్లు వెంకట్రావు ఆధ్వర్యంలో వంట సామాగ్రి,బియ్యం, నిత్యవసరాలు అందజేసిన మండల ఎస్సీ నాయకులు. ఈ కార్యక్రమంలో వైయస్ ఆర్ సిపి జిల్లా సోషల్ మీడియా కోకన్వీనర్ బుడితి సుజన్ కుమార్,మండల ఎస్సీ నాయకులు సబ్బితి రాజేష్,ఖండవల్లి రవికుమార్, తేలి సుందరరావు, ఇల్లూరి సంపత రావు,పొన్నమళ్ళి సంపతరావు,యాళ్ళ హెూనోక్ కుమార్, బింకం యెహెూన్,తులసే బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

తోట సీతారామలక్ష్మితో చంద్రబాబు ముఖాముఖి

విశాలాంధ్ర -భీమవరం: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఉండవల్లి నివాసంలో మంగళవారం పశ్చిమ గోదావరిజిల్లా టీడీపీ అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మితో ముఖా ముఖి సమీక్ష నిర్వహించారు. సమీక్షలో జిల్లాలోని

నియోజకవర్గాల నాయకుల పనితీరు, పార్టీ స్థితిగతులపై చంద్రబాబు సమీ క్షించి మాట్లాడుతూ గ్రూపు రాజకీయాలను ప్రోత్సహిస్తున్న నాయకులపై కఠినచర్యలు తప్పవని, గ్రూపు రాజకీయాలకు పాల్పడేవారి జాబితాను ఇవ్వాలని తెలిపారు. ప్రత్యేకించి భీమవరం నియోజకవర్గ సమీక్షలో బాదుడే బాదుడు, సభ్యత సేకరణ ఇదేంకర్మ రాష్ట్రానికి, సెక్షన్ ఇన్చార్జిల నియామకం నిర్వహణలో వెనుకబడిన గ్రామాలు, వార్డులపై ప్రత్యేకదృష్టి పెట్టాలని నియోజకవర్గ ఇన్చార్జిగా తోట సీతారామలక్ష్మి అంకితభావంతో పనిచేస్తున్నారని ప్రశంసించారు. తొలుత పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ నిర్వహించనున్న యువగళం పాదయాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ లోకేష్ కు పుష్పగుచ్ఛం అందజేశారు.

యువత క్రీడల్లో సత్తా చాటాలి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : యువత క్రీడలలో తమ సత్తా చూపించి ఉన్నతమైన శిఖరాలను అధిరోహించాలని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు తోట వీర వెంకట సత్యనారాయణ(రవి) యువతకు తెలిపారు.

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని చంద్రాయ గూడెం గ్రామంలో కాకి శ్రీను ఆధ్వర్యంలో యువతకు క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో గెలుపొందిన వారికి రవి చేతుల మీదగా బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో యువత చెడు వ్యసనాలకు బానిసలు అవుతున్నారని, అలా చెడు వ్యసనాలకు బానిసలు అవ్వకుండా తమలో ఉన్న ప్రతిభ ను బయటకు తీసుకురావడం కోసం గ్రామాలలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలలో యువత పాల్గొని తమ సత్తా చూపించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అజేయ్, సోదేం సుకుమార్, పొడియం నాగేశ్వరరావు, పొడియం కొవ్వదయ్య, బాబి, రవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రంగవల్లుల పోటీలు

విశాలాంధ్ర-వీరవాసరం: ప్రతి సంవత్సరం సంక్రాంతి సందర్భంగా సంప్రదాయ కళలను ప్రోత్సహిస్తున్న కళాపరిషత్, సేవాదళ్ నిర్వాహకులు అభినందనీయులని మండల పరిషత్ అధ్యక్షురాలు వీరవల్లి దుర్గాభవాని అన్నారు. వీరవాసరం కళాపరిషత్, గుండా వెంకయ్యనాయుడు సేవాదళ్ ఆధ్వర్యంలో నిర్వహించిన గుండా లక్ష్మీ రత్నావతి స్మారక ముగ్గుల పోటీలను, పిల్లలకు

మ్యూజికల్ చైర్ పోటీలను సోమవారం స్నేహ పబ్లిక్ స్కూల్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. సీనియర్స్ విభాగంలో ప్రథమ బహుమతిగా నరసాపురంకు చెందిన జి.అమ్మాజీ రూ.5000, ద్వితీయ బహుమతి భీమవరంనకు చెందిన ఎ.రాధ రూ.3000, తృతీయ బహుమతి బొబ్బనపల్లికి చెందిన డి.నాగజ్యోతికి రూ.2000లను, జూనియర్స్ విభాగంలో వీరవల్లిపాలెంకు చెందిన జె.దుర్గాప్రసన్న, వీరవాసరంకు చెందిన బి.భాను లకు రూ.500లు అందచేశారు. పోటీల్లో మ్యూజికల్ చైర్ పోటీలలో సీనియర్స్ విభాగంలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో తోట శ్రీరామ్, గోపా యామిని,జూనియర్స్ విభాగంలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో డి.లేఖనాలక్ష్మీ, పి.పాంచశ్రీలు గెలుపొందారు. పాల్గొన్న వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ప్రోత్సాహక బహుమతులను అందచేశారు. కార్యక్రమంలో కళాపరిషత్ అధ్యక్షుడు గుండా రామకృష్ణ, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అద్దాల శ్రీరామచంద్రమూర్తి, గుండా బాబు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ పోరుబాట గోడ పత్రిక ఆవిష్కరణ

విశాలాంధ్ర- ఏలూరు: రాష్ట్ర ప్రభుత్వం జగనన్న కాలనీలకు సంబంధించి ఒక్కొక్క లబ్ధిదారికి రూ.5 లక్షలు ఉచితంగా ఇచ్చి ఇళ్లు నిర్మించాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో సీపీఐ పోరుబాట గోడపత్రికలను నాయకులు, కార్యకర్తలతో కలిసి కృష్ణ చైతన్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణ చైతన్య మాట్లాడుతూ జనవరి 17 నుండి 30వ తేదీ వరకు లబ్ధిదారులచే సంతకాల సేకరణ చేసి రెవెన్యూ అధికారులకు వినతులు ఇచ్చే విధంగా సీపీఐ పోరుబాట కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాలలో పేదవారికి ప్రభుత్వమే ఉచితంగా ఇళ్లు నిర్మించి ఇస్తామని పేర్కొందన్నారు. ఇప్పుడు ప్రభుత్వం మాట తప్పి కేవలం కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న రూ.1లక్షా 80 వేలు మాత్రమే ఇచ్చి ఇల్లు నిర్మించుకోమని లబ్ధిదారుల్ని కోరుతున్నదని పేర్కొన్నారు. పట్టణాలలో, నగరాలలో గత ప్రభుత్వ నిర్మించిన టిడ్కో ఇళ్లకు ఎవరైతే డిడిలు తీశారో వారికి ఆ ఇళ్లను స్వాధీనం చేయాలని సిపిఐ డిమాండ్ చేస్తుందని చైతన్య తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జగనన్న కాలనీలలో లబ్ధిదారులకు ఉపయోగపడే విధంగా పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాలలో మూడు సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలని కోరారు. జనవరి 30వ తేదీన లబ్ధిదారులతో రౌండ్ టేబుల్ సమావేశం, ఫిబ్రవరి 6 తేదీన కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా, ఫిబ్రవరి 22వ తేదీన రాష్ట్ర రాజధానిలో మహాధర్నా సిపిఐ నిర్వహిస్తున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కురెళ్ళ వరప్రసాద్, గేదెల నాగేశ్వరరావు, మావూరి విజయ, పోలా భాస్కర్, చింతల దాలి నాయుడు, కనకం జగన్, జి స్వాతి, కాశి తదితరులు పాల్గొన్నారు.

మరియతల్లి మహోత్సవం

విశాలాంధ్ర - లింగపాలెం : పుప్పాలవారిగూడెంలో కృపగల తల్లి నాల్గవ వార్షికోత్సవం జరి గింది. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఫాదర్ బాలను స్థానికులు సత్కరించారు. చింతలపూడి ఏరియా వికర్ జనరల్ జ్ఞానప్రకాష్, పాచ్చానగరం

విచారణకర్త ఫాదర్ యేసురత్నం ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. మరియ తల్లి ప్రజల పట్ల కృప చూపించాలని కోరుతూ గురువులు ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. కార్యక్రమంలో పలువురు ఆర్‌సిఎం గురువులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి జగన్ దళిత ద్రోహి

విశాలాంధ్ర-ఏలూరు: ఎస్సి, ఎస్టి నిధులను దోచుకున్న దళిత ద్రోహి ముఖ్యమంత్రి జగన్ అని టిడిపి ఎస్సి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జాలా బాలాజీ విమర్శించారు. ఎస్ సి, ఎస్టి పథకాలను రద్దుచేసి సబ్ ప్లాన్ నిధులను సక్రమంగా ఖర్చుపెట్టినట్లు కేంద్రానికి

తప్పుడు గణాంకాలు పంపి రాష్ట్రంలో లక్షలాది కుటుంబాలు లబ్ధి పొందినట్లు చూపించడం దుర్మార్గం అన్నారు. దళితులను మోసం చేసిన ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేదన్నారు. దళితుల ఓట్లను కొల్లగొట్టి అధికారం చేపట్టి, దళితుల అభివృద్ధిని పాతాళానికి తొక్కిన ఏకైక ముఖ్యమంత్రిగా జగన్ చరిత్రలో నిలిచిపోతారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి దాసరి ఆంజనేయులు, ఎస్ సి సెల్ నగర అధ్యక్షులు పెద్దాడ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

జీవో నెంబరు ఒకటిని తక్షణమే ఉపసంహరించుకోవాలి

విశాలాంధ్ర -తాడేపల్లిగూడెం రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబరు ఒకటిని తక్షణమే ఉపసరించుకోవాలని ఐ ఎఫ్ టి యు నాయకులు మామిడి దాన వరప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం పెద్ద తాడేపల్లి లో భారత కార్మిక సంఘాల సమైక్య ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మామిడి దాన వరప్రసాద్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు ఉన్న వాక్ స్వాతంత్రాన్ని నిలువరించేందుకు, జీవో నెంబర్ వన్ తీసుకొచ్చిందని అన్నారు. రాష్ట్రంలో ఎమర్జెన్సీ పాలన కొనసాగించేందుకు వైసీపీ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని అన్నారు. బ్రిటిష్ ప్రభుత్వం కూడా ఇటువంటి చట్టం తీసుకొచ్చింది కానీ అమలు చేయలేదని అమలు చేసినట్లయితే మన దేశానికి స్వతంత్రం వచ్చి ఉండేది కాదన్నారు. వెంటనే జీవో నెంబర్ ఒకటిని ఉపసంహ రించుకోవాలని, భారత రాజ్యాంగాన్ని కాపాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డి.వెంకట్రావు రాయుడు, పోలు,ఎం. లక్ష్మీపతి కే.నరేష్ ఎస్.కృష్ణ, నాగేశ్వరరావు, తాతారావు, యేసురత్నం, ఉడత రాంబాబు తదితరులు పాల్గొన్నారు.